వైకల్యం ఎక్కువ ఉన్నవారికి ప్రాధాన్యం

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో వైకల్య శాతం ఎక్కువగా ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం అధికారులు తెలిపారు. డిగ్రీ ఆపైన చదువుకున్న వారికి వైకల్య ప్రాధాన్యతగా మూడు చక్రాల స్కూటర్ ఇస్తారని తెలిపారు. డిగ్రీ చదువుకుంటున్న వారికి టెక్నికల్ కోర్స్ వారికి ల్యాప్‌టాప్‌లు, ఇంటర్ చదువుతున్న దృష్టి లోపం ఉన్నవారికి ట్యాబ్స్ అందజేస్తారని అన్నారు. పదో తరగతి చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్నవారికి 5జీ స్మార్ట్ ఫోన్స్ ఇస్తారని లెప్రసీ వైకల్యం ఉన్న వారికి ఎంఎల్‌సీ (మైక్రో సెల్యులర్ రబ్బర్) చెప్పులు, కండరాల క్షీణత వైకల్యం గల వారికి బ్యాటరీ వీల్‌చైర్స్ అందజేస్తారని వారు తెలిపారు.

బండ్లగూడ డీఎంగా రమేష్‌బాబు

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా తల్లాడ రమేష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవరకొండ డిపో నుంచి బదిలీపై బండ్లగూడకు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ రమాదేవి, అసిస్టెంట్ ఇంజనీర్ యోగేశ్వరి, డిపో సిబ్బంది, ఇతర అధికారులు డిపో మేనేజర్‌కు స్వాగతం పలికారు. అందరం బాధ్యతతో పనిచేస్తే బండ్లగూడ డిపోను రీజియన్‌లో అగ్రస్థానంలో నిలపడం సాధ్యమని ఆయన అన్నారు.

సైదాబాద్ తహసీల్దార్‌గా శ్రీదేవి



సైదాబాద్: సైదాబాద్ మండలం నూతన తహసీల్దార్‌గా శ్రీదేవి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన జయశ్రీ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్డీఓ కార్యాయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి సైదాబాద్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. శుక్రవారం శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సైదాబాద్ మండల కార్యాలయంలోని సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైదాబాద్ మండలం పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు..!

● పార్కు స్థలాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు ● ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్ల కేటాయింపు

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని రిజిస్ట్రేషన్ల శాఖతో పాటు జీహెచ్ఎంసీ అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వినిస్తున్నాయి. పార్కు స్థలంలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు, ఓపెన్ ప్లాట్లకు ఇంటి నంబర్ కేటాయించి పీటీఐ నంబర్ ఇచ్చినందు రెండు శాఖల అధికారుల పనితీరు అక్రమార్కులకు రాజముద్ర వేయడం పట్ల పలువురు మండిపడుతున్నారు.కబ్జాదారులకు వత్తాసు పలుకుతు అక్రమార్జనకు పాల్పడుతూ ప్రజా ఆస్తులను కొల్లగొడుతున్న అధికారుల వ్యవహార శైలి వివాదాస్పదంగా మారుతోంది. లింక్ డ్యాకుమెంటు లేకున్నా కబ్జాదారులతో కుమ్మక్కై ఇరువురికి ఆర్థికపరమైన లింకులు ఏర్పడి ఇలా ఖాళీ స్థలాలు, పార్కులను కొల్లగొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్లు, జీహెచ్ఎంసీ అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారు. లింక్ డ్యాకుమెంటు నంబర్‌లేని ప్లాట్లకు ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్, పార్కు స్థలానివనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం.

పార్కుపై అక్రమార్కుల కన్ను.!

బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సిరిపురం కాలనీలో ఛత్రపతి శివాజీపార్కు కోసం సర్వే నంబర్ 200లో 1967లొనే 5000ల గజాలను వదిలేశారు. ఈ పార్కు కోసం 2008లో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఎల్బీనగర్ సర్కిల్ అధికారులు రూ.6,45లక్షల వ్యయంతో ప్రహారిగోడకు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేశారు. దీనితో పాటు మరో రెండు ప్లే గ్రౌండ్‌కు సుమారుగా రూ.ఋ12లక్షలతో అభివృద్ధి చేయడం జరిగింది. ఈ విధంగా అభివృద్ధి చేసిన పార్కు, ప్లే గ్రౌండ్‌లపై కబ్జా దారుల కన్ను పడింది. కొంత మంది కబ్జాదారులు సబ్ రిజిస్ట్రార్‌తో ఆర్థిక లింకులు చేసుకున్న వీరు ఇక ఈ స్థలాలపై 100గజాలు, 150 గజాలు, 200గజాలు ఈ విధంగా పార్కుతోపాటు ప్లే గ్రౌండ్లను సుమారుగా 15ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ డ్యాకుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ అడ్డదారిన పెండింగ్ రిజిస్ట్రేన్లు చేసి తమకేమి పట్టనట్లు వ్యవహరించారు. అడ్డదారిన చేసిన ఈ డ్యాకుమెంట్లకు సదరు కబ్జాదారులు రెగ్యులర్ చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు ప్రకారం పెండింగ్‌లో ఉన్న డ్యాకుమెంట్లకు చట్టబద్ధత కలిగింది. ఈతంతూ అంత చూస్తే లక్షలలో సబ్ రిజిస్ట్రార్, కబ్జాదారుల మధ్య లావాదేవిలు జరిగినట్లు తెలుస్తోంది.

రెవెన్యూ మంత్రికి వినతి...

బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పార్కును రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కాలనీ వాసులతో కలసి వినతి పత్రం అందజేశారు. కబ్జాదారులతో వత్తాసు పలికిన అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొనడం గమనార్హం.



సుందరంగా తీర్చిదిద్దిన పార్కు దృశ్యం

ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్....

కర్మన్‌ఘాట్‌లోని శ్రీరమణకాలనీలో సర్వేనంబర్ 60లో గతంలో పంచాయతీ లేఅవుట్ చేశారు. అప్పట్లో చేసిన ఈ లేఅవుట్‌లో భూమి యజమానులు ప్లాట్లను అమ్ముకున్నారు. అసమయంలో క్రయ విక్రయాలు జరిగిన ప్లాట్లకు ఆన్‌లైన్ నమోదు లేకపోవడం వలన కొంత మంది కబ్జాదారులు ఈ ఖాళీ స్థలాలపై కన్నుపడింది. దీంతో నోటరీలు తయారు చేసి డ్యాకుమెంట్లను సృష్టించారు. ఈ ఖాళీ స్థలాలకు ఎల్బీనగర్ సర్కిల్-4 రెవెన్యూ అధికారులకు ఎర వేసి నిర్మాణాలు లేకున్నా ఈ స్థలాలపై ఇంటి నెంబర్లను తీసుకున్నారు. వెంటనే ఈ ఇళ్లులు లేకున్నా ఆస్తి పన్ను చెల్లించే రషీదులను పొందారు. దీంతో ఈ ప్లాట్లు సర్కిల్ కార్యాయలంలో ఆన్‌లైన్‌లో నమోదు అయింది.ఇలా దొంగ పత్రాలను సృష్టించి, ఇంటి నంబర్ పొందిన ఖాళీ స్థలాలకు ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేన్ చేసి చట్టబద్ధత కల్పించారు. ఇలా సబ్ రిజిస్ట్రార్ల అక్రమార్జనలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటు ఎల్బీనగర్, వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ల పనితీరుపై సమగ్ర విచారణ జరిపించి కబ్జాదారులకు వత్తాసు పలికిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బీఎస్‌రెడ్డినగర్‌లోని సిరిపురం కాలనీలో అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న పార్కు దృశ్యం

సైదాబాద్‌లో పోక్సో కేసుల పరంపర!

వరుస ఘటనలతో నమోదవుతున్న కేసులు

సైదాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసుల పరంపర కొనసాగుతోంది. వరుస ఘటనలతో పీఎస్‌లో కేసులు నమోదు అవుతున్నాయి. సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలుడిపై లైంగిక దాడి జరిగిన ఘటన వారం క్రితం వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై సైదాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆ తరువాత పోలీసుల విచారణలో మొదటి కేసులో నిందితుడు మరో ఇద్దరు బాలలపై సైతం లైంగిక దాడులు చేశాడని నిర్ధారించారు. ఆ రెండు ఘటనల్లో సైతం అతడిపై మరో రెండు పోక్సో కేసులు నమోదయ్యాయి.

☛ ఆ తరువాత గురువారం సైదాబాద్ పీఎస్‌లో మరో పోక్సో కేసు నమోదైంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై పాత పరిచయాన్ని ఆసరాగా చేసుకొని యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. దాంతో అతనిపై పోక్సో కేసు నమోదయ్యింది. తాజాగా పీఎస్ పరిధిలో ముగ్గురు పాఠశాల విద్యార్థినులైన ముగ్గురిపై పక్కింట్లో ఉండే వ్యక్తి లైంగిక దాడులు చేయడంతో అతడిపైనా పోక్సో కేసు నమోదైంది. కొత్త కేసులే కాకుండా సైదాబాద్ పీఎస్‌లో 2023లో నమోదైన ఒక పోక్సో కేసు నిందితుడికి న్యాయస్థానం రెండు రోజుల క్రితం 21 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఇలా వారం రోజుల నుంచి సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస పోక్సో కేసుల నమోదులపై స్థానికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టంచేశారు. నాగోలు డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మ బస్తీలో నివాసముండే సమ్మయ్య కడుపునొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతోంది. ఆర్థిక పరిస్థితులు బాగలేక కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.55లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మహేష్‌యాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్నజక్కిడి శివచరణ్‌రెడ్డి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అందజేత

మన్సూరాబాద్ డివిజన్ సాయినాథ్‌కాలనీకి చెందిన దేప మణెమ్మ మోకాళ్ల సమస్యతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. చికిత్స ఖర్చులు భరించలేక కుటుంబసభ్యులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించన శివచరణ్‌రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రమల రాంరెడ్డి, కార్యదర్శి కొత్తకుర్మ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఉప్పరిగూడ సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

చంచల్‌గూడ: దీపావళి పండుగను పురస్కరించుకుని చంచల్‌గూడ మెయిన్ రోడ్డులో ఈనెల 21వ తేదీన ఉప్పరిగూడ యాదవ సంఘం ఆద్వర్యంలో సదర్ మేళా ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైస్‌చైర్మన్ నిరంజన్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక రామాలయంలో సదర్ ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సదర్ పోటీలో పాల్గొనే దున్నపోతులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. దున్నపోతుల ప్రదర్శన సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యాదవులు తమ దున్నపోతులను సకాలంలో మేళాకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంపత్‌యాదవ్, వెంకటరామ్‌పాల్‌యాదవ్, రాజు యాదవ్, ధన్‌రాజ్‌యాదవ్, అనిల్‌యాదవ్, పెరిక శ్రీనివాస్, రాహుల్‌కిషోర్‌యాదవ్, యాట ప్రమోద్, నవీన్‌యాదవ్, రాంనరేష్‌యాదవ్, పెద్దియాద్‌లు పాల్గొన్నారు.



ఉప్పరిగూలో సదర్ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేస్తున్న సంఘం సభ్యులు

మరో బాలుడిపైనా రెహమాన్ లైంగిక దాడి

సదనం ఘటనలో మరో కేసు నమోదు

సైదాబాద్: సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడు రెహమాన్‌పై పోలీసుల విచారణలో మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు బాలలపై లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో రెహమాన్‌పై రెండు కేసులు నమోదు చేసిన సంగతి విదితమే. గురువారం అతను సదనంలో మరో బాలుడిపై కూడా లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెహమాన్‌పై సైదాబాద్ పోలీసులు మూడో కేసు నమోదు చేసారు. ఇప్పటికే రెహమాన్‌ను పోలీసులు జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అయితే అతను పది మంది బాలలపై లైంగిక దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. విచారణ పూర్తయ్యే లోగా నిందితుడిపై మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉంది.

తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు

సాక్షి, సిటీబ్యూరో: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం శనివారం నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్ధతును తెలియజేస్తున్నట్లు కరికాలభక్తులు, కైకాల,కైకోలస్, శెంగుండం,శెంగుందర్ చేనేత కుల సేవా సంఘం అధ్యక్షులు పెరమలసెట్టి వెంకట్‌రావు, ప్రధానకార్యదర్శి పాలాటి వెంకట శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.అనేక దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న వెనుకబడిన వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిని సాధించేందుకు 42 శాతం రిజర్వేషన్‌లను తప్పనిసరిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ ఉద్యమానికి తాము ఉండగా నిలవనున్నట్లు పేర్కొన్నారు.

మన ఆలోచన సాధన సమితి మద్దతు..

నాగోలు: తెలంగాణ వ్యాప్తంగా శనివారం జరిగే బంద్ ఫర్ జస్టిస్ పేరుతో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేయాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలే, కాలేజీలు, వాణిజ్య సంస్థలు, ఆర్టీసీ డిపోలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ వాణిజ్య సంస్థలను కలిసి వారికి రేపటి బంద్‌ను విజయవంతమయ్యేలా సహకరించాలని కోరారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడిపై కేసు నమోదు

సైదాబాద్: పాత పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై ఓ యువకుడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...భర్తతో విడిపోయిన మహిళ తన కుమార్తెతో (15)తో కలిసి సైదాబాద్‌లో నివాసం ఉంటోంది. గతంలో వారు శంకేశ్వరబజార్‌లో అద్దెకు ఉన్న సమయంలో పక్కింట్లో ఉండే యువకుడితో పరిచయం ఉండేది. దీనిని ఆసరాగా తీసుకున్న అతను తరచూ సైదాబాద్‌లోని వారి ఇంటికి వచ్చి వెళుతున్నాడు. చుట్టుపక్కల వారి ద్వారా ఈ విషయం తెలియడంతో ఆమె కుమార్తెను నిలదీయగా సదరు యువకుడు తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే ఫోన్‌లో తీసిన ఫొటోలను బయట పెడతానని బెదిరిస్తున్నట్లు చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హయత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌లోని మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూకంపం సృష్టించైనా బీసీ రిజర్వేషన్ సాధిస్తాం



ర్యాలీ పాల్గొన్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం నాయకులు

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

మలక్‌పేట: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ శనివారం చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆ సంఘం సినీయర్ నేతలు నీలం వెంకటేష్, అనంతయ్య ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా ఇవ్వాలని శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బంద్‌కు 35 బీసీ సంఘాలు, 136 కుల సంఘాల జేఏసీ, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, నక్సలైట్లు అందరూ బంద్‌కు సంపూర్ణమైన మద్దతు తెలియజేశారన్నారు. దుకాణదారులు, వ్యాపార, విద్యాసంస్థలు, పెట్రోలు బంక్‌లు, బస్సులు, స్వచ్ఛందంగా, శాంతియుత వాతావరణంలో బంద్ పాటించాలని కోరారు. బీసీలు అంటే చిన్నచూపు పనికిరాదని. రాజ్యాంగ బద్ధంగా బీసీలకు రావాల్సిన వాటా బీసీలకు ఇవ్వడానికి కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో కూడా రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూకంపం సృష్టించైనా సరే 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. గడ్డిఅన్నారం చౌరస్తా నుంచి ఐడియల్ కాలేజ్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీసీ నాయకులు రాజేందర్, సతీష్, రామకృష్ణ, భాస్కర్, శివయాదవ్, నరేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



బొమ్మ రఘురాంనేత

ఎల్బీనగర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం శనివారం నిర్వహించనున్న బంద్‌కు పార్టీలకు , కులామతాల అతీతంగా మద్దుతు తెలపాలని బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురాంనేత విజ్ఞప్తి చేశారు. ఈ బంద్‌లో మేధావులు, విద్యార్థులు, యువకులు, కళాకారులు, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు సాధించే వరకు బీసీల పోరాటం ఆగదని పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను అడ్డుకుంటే తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ పోరాటంలో అంతిమ విజయం వరకు పోరాడాలన్నారు. బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ల కోసమే తప్ప తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ప్రతి బీసీ నాయకులు తమ ప్రాంతంలో శనివారం నిర్వహించే బంద్‌లో పాల్గొని పెద్ద ఎత్తున బీసీ నినాదం వినిపించాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను సాధించి తీరుతాం

– మామిడి రామకృష్ణగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర బందులో సకల జనులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ నాయకులు, శ్రీ నూతనగౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి రామకృష్ణగౌడ్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన కులాలు, సంఘాలు మేధావులు, యువత, మహిళలు, కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేట్, ఉద్యోగులు ముఖ్యంగా రాజకీయ పార్టీలు బంద్‌లో పాల్గొని విజయంతం చేయాలన్నారు. అవసరమైతే చట్టసవరణ చేసి, స్థానిక సంస్థలల్లో చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చేస్తారని ప్రశ్నించారు.

కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్‌లోనే తగిన గుర్తింపు

మహారాష్ట్ర ఎమ్మెల్యే అమీన్ పటేల్

సైదాబాద్: పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తప్పనిరిగా తగిన గుర్తింపు లభిస్తుందని మహారాష్ట్ర ఎమ్మెల్యే అమీన్ పటేల్ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర భక్తసమాజంలో యాకత్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమీన్ పటేల్ మాట్లాడుతూ, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరికీ ఆమోదయోగ్యమైన నాయుడిని డీసీసీ అధ్యక్షునిగా నియమిస్తారని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అర్హులైన అందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్‌ఉల్లా, యాకత్‌పురా ఇన్‌చార్జ్ రవిరాజ్, టీపీసీసీ నాయకులు ఎ.భాస్కర్, నర్సింగ్‌రావు, కోట్ల లడ్డూ పటేల్ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమీన్ పటేల్, కోట్ల శ్రీనివాస్

రిజర్వేషన్లను అమలు చేయటంలో చిత్తశుద్ధి లేదు

మన్సూరాబాద్: విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు, బీసీ ఇంటలెక్చువల్ పోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లోని సోషల్ జస్టిస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటలను ఆయన విడుదల చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయటంలో చిత్తశుద్ధి లేదన్నారు. బీసీ ప్రజల ఓట్ బ్యాంక్‌కు మూడు పార్టీల్లోని అగ్రకుల నేతలు కపట నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మండిపడ్డారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లను ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంటుందన్నారు. మండల కమిషన్ నుంచి ఇదే కుట్రపూరిత వైఖరిని బీజేపీ కొనసాగిస్తుందన్నారు. సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి కేవీ గౌడ్, ప్రతినిధి కొండల్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, గులాం, గౌలికర్ సోని, అశోక్‌యాదవ్, బాలస్వామి ప్రకటనను విడుదల చేసిన వారిలో ఉన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీవిజయదుర్గా మాత ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైదాబాద్ మాతామైదాన్‌లోని శ్రీవిజయదుర్గా మాతా ఆలయ ప్రాంగణంలో రామాంతపూర్ మెడి ఐ కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య సిబ్బంది వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను వారు ఉచితంగా అందజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 100 మందికి పైగా పాల్గొని చికిత్సలు పొందారని నిర్వాహకులు తెలిపారు.

వ్యభిచారం ముఠా అరెస్టు

నాగోలు: అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు బండ్లగూడ పరిధిలోని సహభావన టౌన్‌షిప్‌లో బ్లాక్ నెం సి 5లో ఓ ప్లాట్‌లో షేక్ యేసు బాబు, పి.దుర్గ భార్యాభర్తలు. వారు ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నారు. సనారా గాజీ, చైమా మొల్ల, గుజ్జ సందీప్‌కుమార్, దుర్గ, షేక్ యేసుబాబును అరెస్టు చేసి నాగోలు పోలీసులకు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.